19

చిరు దివ్వె

అది ఒక చిన్న కుటుంబం. ఆస్తి, అందం, ఆరోగ్యం వీటన్నిటితోపాటు మంచితనం కూడా మేళవించిన వ్యక్తులున్న చూడచక్కని కుటుంబం. శేఖరం, ఆయన భార్య సుమిత్ర. శేఖరానికి బాపట్ల దగ్గర పల్లెటూర్లో ఇల్లు, పొలాలు ఉన్నాయి. ఆయనకు ఇద్దరు కూతుళ్లు. ఒక్కడే కొడుకు. పేరు శశాంక్. అతని భార్య విద్య. వాళ్ళిద్దరికీ ఒక్కతే కూతురు. పేరు శ్రీలలిత. వాళ్ళింట్లో అందరూ లలితా సహస్రనామ పారాయణం చేస్తారు. కాబట్టి పాపకి ఆ పేరు పెట్టారు.

శశాంక్‌కి మంచి ఉద్యోగం ఉంది. కూతురు పుట్టేదాకా విద్య కూడా మంచి ఉద్యోగమే చేసేది. శ్రీలలితకి పదేళ్ళు నిండాయి. మంచి తెలివైన పిల్ల. చదరంగం, సంగీతం కూడా నేర్చుకుంటోంది. ఇక పెద్దవాళ్ల విషయానికి వస్తే వారి జీవితాలకు అర్థమూ పరమార్థమూ కూడా శ్రీలలితే. అమ్మా నాన్నల శిక్షణలో ఆధునికతను, తాత బామ్మల దగ్గర సంస్కృతీ సంప్రదాయాలను నేర్చుకుంటూ అపురూపమైన బాల్యాన్ని చవిచూస్తోంది.

కిందటిరోజు అలవాటు ప్రకారం కూతురుకి అన్నం పెట్టడానికి వెండి కంచం కోసం వెతికింది విద్య. కనిపించలేదు. సర్లే, ఏ గిన్నెలలో కలిసిపోయిందో అని వేరే కంచంలో అన్నం పెట్టేసింది. ఆ తరువాత వెండి కంచం విషయం మరిచిపోయింది. తెల్లారాక ఆ విషయం గుర్తుకొచ్చి కంచం కోసం వెతికింది. వెండి కంచం, దానితో పాటు వెండి గ్లాసు కూడా కనిపించలేదు. "మీరేమైనా తీశారా అత్తయ్యా" అని అత్తగారిని అడిగింది. "లేదే, నేను తీయలేదమ్మా" అంది సుమిత్ర.

అత్తా కోడళ్ళు కంగారుపడిపోయి వంటిల్లంతా వెతికారు. అవి కనిపించలేదు. ఏదో అనుమానం వచ్చి పడక గదిలోకి వెళ్ళి డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు లాగి, చిన్న డబ్బా మూత తీసి చూసింది. అందులో ఉండే శ్రీలలిత బంగారు లాకెట్ గొలుసు కూడా లేదు. ఒక వస్తువు కనిపించకపోతే ఏమో అనుకోవచ్చు. కానీ ఏకంగా మూడు...! ఏమైపోయాయి? ఎవరు తీశారు? ఇంట్లోకి చనువుగా వచ్చిపోయేది ఇద్దరే. పనిమనిషి కుమారి, బట్టలు ఇస్త్రీ చేసే అమ్మాయి లక్ష్మి. ఇంకెవరూ రారు.

కిందటిరోజు లక్ష్మి వచ్చి వెళ్ళింది. ఖచ్చితంగా వారిద్దరిలో ఎవరో ఒకరు తీసి ఉంటారు. నమ్మశక్యం కావటంలేదు. ఇద్దరూ మంచివాళ్ళే. ఎన్నో ఏళ్ళుగా పనిచేస్తున్నారు. ఎప్పుడూ ఏమీ పోలేదు. వాళ్ళిలాంటి పని చేస్తారా. వాళ్ళు తీయకపోతే మరి ఎక్కడికి పోయాయి? ఇప్పుడేం చేయాలి?

పోలీసు రిపోర్ట్ ఇవ్వాలా? ఇస్తే నేలన పోయేదాన్ని నెత్తికి రాసుకున్నట్లు అవుతుందా? వస్తువులు దొరుకుతాయో లేదో నమ్మకం లేదు. కానీ పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. పోలీసులు ముందుగా పనివాళ్లను తీసుకుపోయి నాలుగు తగిలిస్తారు. పనివాళ్ళ తరఫు వాళ్ళు ఇంటి మీదకొచ్చి దెబ్బలాడతారు. పనివాళ్ళు పనులు మానేస్తారు. ఒకసారి వాళ్లమీద దొంగతనం మోపారని తెలిస్తే ఇంకెవరూ పనిలోకి రారు. పనివాళ్ళు లేని జీవితం దుర్భరంగా మారిపోతుంది. సరే పోతేపోయిందని ఊరుకోడానికి వీల్లేదు. ఇవ్వాళ ఇది అయింది. రేపు ఇంకొకటి మాయమవుతుంది.

అందరూ తలలు పట్టుకు కూర్చున్నారు.

"సర్లే నేను చూసుకుంటాలే" అని హామీ ఇచ్చింది సుమిత్ర. "పెద్దది, అనుభవజ్ఞురాలు ఆవిడే చూసుకుంటుంది" అనుకుంది విద్య.

శశాంక్ ఆఫీసుకి, శ్రీలలిత స్కూలుకి వెళ్లారు. కుమారి పనిలోకి వచ్చింది. "రాత్రంతా నిద్రలేదు, కుమారీ" అంటూ మొదలుపెట్టి జరిగిందంతా చెప్పింది సుమిత్ర.

కుమారి ముఖం పాలిపోయింది. "అదేమిటమ్మా. ఎలా పోయాయి?" అంది అయోమయంగా.

"అదే మాకూ అర్థం కావటం లేదు. బయటవారెవరూ రాలేదు" అంది సుమిత్ర.

"ఇల్లంతా చూశారా అమ్మా?" అడిగింది కుమారి.

"మాకు దొరకలేదు. నువ్వు చూడు దొరికితే నీకు బహుమతి ఇస్తాం" అంది సుమిత్ర.

"అదేం వద్దమ్మా. దొరికితే నేనే మైసమ్మ తల్లికి నైవేద్యం పెడతాను" అంది కుమారి. పాపం, ఆమె భయం ఆమెది. ఇంట్లో ఏమైనా వస్తువులు పోతే పోలీసు రిపోర్ట్ ఇస్తారు. వాళ్ళు ముందు పనివాళ్ళనే పట్టుకుపోతారు. వాళ్ళ చేతుల్లో పడ్డాక ఒళ్ళు హూనమవడమే కాకుండా 'దొంగ' అనే పేరు పడుతుంది. ఇంకెక్కడా పని దొరకదు. ఇన్నాళ్ళుగా ఇన్ని ఇళ్ళల్లో పనిచేస్తున్నా, ఎప్పుడు ఇటువంటి పరిస్థితి రాలేదు. కాళ్ళు చేతులు వణికిపోతూనే వంటిల్లు అంతా వెతకటం మొదలు పెట్టింది కుమారి.

హాల్లో ఫోన్ మోగింది. శేఖరం ఫోన్ తీశాడు. "విద్యా, నీకే ఫోన్" అని కోడల్ని పిలిచాడు.

చిరాకుగా ఉన్న విద్య "ఎవరూ? తర్వాత చేయమనండి మావయ్యగారూ" అంది. ఆ మాటే చెప్పి, "కాదుటమ్మా అర్జంట్‌గా మాట్లాడాలట" అన్నాడు.

విసుగ్గా వచ్చి ఫోన్ అందుకుంది విద్య. అవతల మహాలక్ష్మి జ్యూవలర్స్ షాపు యజమాని. ఎప్పుడైనా పెద్ద పెద్ద వస్తువులు, పెద్ద షాపుల్లోనే కొన్నా, ఇంటి దగ్గరలోనే ఉండే ఈ 'మహాలక్ష్మి' షాపులో ఏదైనా అర్జంట్‌గా కొంటూ ఉంటుంది. అతను అడపా దడపా ఫోన్ చేసి 'ఫలానివాళ్లు ఎవరో కొత్త రకం నగ చేయించారు. చాలా బాగుంది చూస్తారా?' అని అడుగుతుంటాడు.

'అంభంలో కుంభం, ఆదివారంలో సోమవారం' అన్నట్టు ఇప్పుడు ఈ హడావిడిలో అతను ఫోన్ చేసేటప్పటికి చిరాకు వచ్చేసింది విద్యకు. "ఏమిటండీ, ఏం కావాలి?" అంది విసుగ్గా.

"మీతో మాట్లాడాలి. తీరిగ్గా ఉన్నారా?" అన్నాడు.

"చాలా హడావిడిగా ఉన్నాను. మీరు తర్వాత ఫోన్ చేయండి" అంది.

"కాదు మేడం. మీతో అర్జంట్‌గా మాట్లాడాలి" అన్నాడు.

"నగల విషయమైతే నాకు ఇంట్రస్ట్ లేదండి" చిరాకు స్పష్టంగా తెలిసిపోతోంది ఆమె గొంతులో.

"నగల విషయమైతే ఇంత పొద్దున్నే మిమ్మల్ని ఇబ్బంది పెడతానా? మీకో విషయం చెప్పాలి. జాగ్రత్తగా వినండి. నే చెప్పబోయే విషయం మీకు బాధ కలిగించ వచ్చు. నిజానికి పనిమాలి ఫోన్ చేసి చెప్పాల్సిన అవసరం లేదు. కానీ మీ మంచి కోరేవాడిని కాబట్టి చెప్తున్నాను" అన్నాడు.

తెల్లబోయింది విద్య. అతను నగల షాపు యజమాని, తనో కొనుగోలు దారు. అతను తనతో చెప్పాల్సినంత ముఖ్యమైన విషయమేంటో, "సరే చెప్పండి" అంది.

"అమ్మా, నిన్న సాయంత్రం మీ అమ్మాయి మరో అమ్మాయిని వెంటబెట్టుకుని మా షాపుకి వచ్చింది"

"మా అమ్మాయా? మీ షాప్‌కా?"

"అవును. నాకు ఆశ్చర్యం వేసింది. 'ఏమ్మా ఏం కావాలి? అమ్మగారు పంపించారా?' అని అడిగాను. 'కాదంకుల్, నాకు డబ్బు కావాలి. రెండొందల యాభై గ్రాముల బరువుండే వెండి కంచం, యాభై గ్రాముల వెండి గ్లాసు, పదిహేను గ్రాముల బంగారం ఉన్నాయి. అవి అమ్ముతాను' అని చెప్పింది. నేను నిర్ఘాంతపోయాను. 'చిన్నపిల్లవి. వస్తువులు అమ్ముతాననడం, డబ్బు కావాలనడం... ఏమిటమ్మా ఇదంతా? అన్నాను. 'కారణాలు అడగకండి, నాకు కావాలి... అంతే' అంది. షాపులో చాలా మంది ఉన్నారు. వింతగా చూస్తున్నారు. ఎందుకనవసరంగా గొడవ అనుకుని 'ఇప్పుడు నాకు తీరిక లేదు, రేపు పొద్దున్న రా' అన్నాను. 'పొద్దున్న నేను స్కూలుకి వెళ్ళాలి. సాయంత్రం వస్తా' అని చెప్పి వెళ్లిపోయింది. ఈ విషయం చెప్పాలనే ఫోన్ చేశాను. మీ మనసుకి కష్టం కలిగిస్తే క్షమించండి" అని చెప్పేసి సమాధానం కోసం ఎదురు చూడకుండా ఫోన్ పెట్టేశాడు. అతను.

కుప్పకూలిపోయింది విద్య.

కోడలు వాలకం చూసి కంగారుపడ్డ శేఖరం భార్యను పిలిచాడు. ఆవిడ వచ్చింది. "విద్యా ఏమైంది?" అని అడిగింది. సమాధానం చెప్పకుండా కూతురి గదిలోకి వెళ్ళింది సుమిత్ర. వెతకడం మొదలుపెట్టింది విద్య. ఎక్కువ శ్రమ పడకుండానే దొరికాయి.

స్టడీ టేబుల్ సొరుగులో భద్రంగా కవరులో కట్టి ఉన్నాయి ఆ వస్తువులు. తట్టుకోలేపోయింది విద్య. అత్తగారిని కావలించుకుని బావురుమని ఏడ్చింది. విషయం అర్థమయింది సుమిత్రకి. కోడలిని అలాగే వదిలేసి వంటింట్లోకి వెళ్ళింది. వెతుకుతున్న కుమారిని వారించింది. "వదిలేయ్ కుమారీ! నిన్న మా వియ్యపురాలు వచ్చింది. ఆవిడేమైనా తీసిందేమో? నువ్వు నీ పని చేసుకో. మన సొమ్ము గట్టిది. ఎక్కడికి పోదు" అంది.

కుమారి ముఖం తేటపడింది. మామూలుగా పని చేసుకుని వెళ్లిపోయింది.

ఉన్నపాటున రమ్మని భర్తకు ఫోన్ చేసి చెప్పింది విద్య. అతను ఆఘమేఘాల మీద వచ్చేశాడు. జరిగింది తెలుసుకుని పిడుగు పడినట్లయింది అతనికి. కూతురు దొంగతనం చేసిందనే నిజం జీర్ణించుకోలేక తల్లడిల్లి పోయాడు.

ఆ తర్వాత నలుగురూ ఒకేచోట కూర్చున్నారు. తిండిమీద ధ్యాసలేదు. ఎవరూ మాట్లాడుకోవడం లేదు.

వాళ్ళ మనసులో ఎన్నో సందేహాలు! 'ఎందుకు చేసింది ఈ పని? ఏం తక్కువ చేశాం? చెడు స్నేహాలు చేస్తోందా? ఏమైనా చెడ్డ అలవాట్లకు లోనయిందా?' అన్నీ ప్రశ్నలే. మామూలుగా సాయంత్రం నాలుగింటికి ఇంటికి వచ్చింది శ్రీలలిత.

రాగానే నేరుగా అడిగేశాడు శశాంక్. తియ్యలేదని బుకాయిస్తుందనీ, భయపడిపోయి ఏడ్చేస్తుందనీ, ఇంకెప్పుడూ చేయనని ప్రాధేయపడుతుందనీ అనుకున్నాడు.

కానీ అమ్మాయి ముఖంలో భయంలేదు. బాధా లేదు. "అవును తీశాను" అంది.

"అమ్మాలనుకున్నావా?" అంటే

"అవును" అంది.

"ఎందుకు చేశావు ఈ పని?" అంటే

"నాకు డబ్బు కావాల్సి వచ్చింది" అంది.

"మరి మాకెందుకు చెప్పలేదు?" అంటే

"చెప్పకుండా దాచాలనుకున్నాను" అంది.

మాటకు మాట బదులు చెప్తున్న కూతురుని చూసి శశాంక్ కోపం అవధులు దాటింది. చాచిపెట్టి లెంపకాయ కొట్టాడు. విద్య కూడా కోపం పట్టలేక వీపుమీద నాలుగు వాయించింది.

బావురుమని ఏడ్చింది. శ్రీలలిత. "తాతయ్యా" అంటూ తాతగారి వైపు వెళ్ళబోయింది.

"తాతయ్యా లేదు, ఏమీ లేదు" అంటూ రెక్క పుచ్చుకుని లాక్కెళ్ళి గదిలో పడేసి తలుపేశాడు శశాంక్.

మరికాసేపటికి ఆ ఊళ్లోనే ఉన్న అమ్మమ్మ, తాతయ్య, మేనమామ వచ్చేశారు. వారిని చూడగానే మరోసారి ఏడ్చేసింది విద్య. జరిగిందంతా మరోసారి వివరంగా అడిగి తెలుసుకున్నాడు మేనమామ. "సారీ అయినా చెప్పటం లేదంటే... ఇది చాలా సీరియస్ విషయం. ఈ రోజుల్లో పిల్లలు చాలా త్వరగా పెడదారి పడుతున్నారు. మనవల్ల కాదు. నాకు ఒక మంచి ఫ్రెండ్ ఉన్నాడు. చైల్డ్ సైకాలజీలో స్పెషలిస్ట్. సైకియాట్రిస్ట్‌గా మంచి ప్రాక్టీసు ఉంది అతనికి. అతని దగ్గరకు తీసుకువెళదాం. అప్పాయింట్‌మెంట్ తీసుకుంటాను" అన్నాడు.

విద్య మళ్ళీ బావురుమని ఏడ్చింది. శశాంక్ కూడా కన్నీళ్లు పెట్టుకున్నాడు.. వాళ్ళిద్దరి వంకా జాలిగా చూశాడు మేనమామ. లేచి వెళ్ళి డాక్టరుకి ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ తీసుకున్నాడు. ఎనిమిదిన్నరకు తీసుకురమ్మన్నాడు డాక్టర్.

సుమిత్ర కళ్ళు తుడుచుకుంది. "స్కూలు నుంచి వచ్చాక పాప ఏమీ తినలేదు. అన్నంపెట్టి తీసుకెళ్దురుగాని" అంది. ఆవిడ ప్రాణం విలవిలలాడిపోతోంది. అసలు కంటే వడ్డీ ముద్దు కదా!

కంచం తీసుకుని గదిలోకి వెళ్ళబోతున్న భార్యను వారించాడు శేఖరం. "ఇటు ఇవ్వు నేను పెడతాను" అన్నాడు. అన్నం పెడుతూ కథలు చెప్పడం తాతగారికి, తింటూ వినడం మనవరాలికి ఎంతో ఇష్టం. తలుపు తీసుకుని లోపలికి వెళ్ళాడు.

మంచంమీద ముడుచుకు పడుకున్న శ్రీలలిత తాతయ్యను చూసి నవ్వింది. ఏడ్చి ఏడ్చి వాడిపోయిన ఆ ముఖం చూసి ఆయన ప్రాణం కలుక్కుమంది. దగ్గర కూర్చుని తల నిమిరాడు. "అన్నం తినమ్మా" అన్నాడు. ఆకలిగా తినసాగింది పాప.

"అమ్మలూ! నిన్ను డాక్టర్ దగ్గరకు తీసుకెళతారు".

"డాక్టర్ దగ్గరకా, ఎందుకు తాతయ్యా? నాకు బాగానే ఉందిగా!"

"కాదమ్మా... తీసుకెళ్ళాలి".

"ఇంజెక్షన్ ఇస్తారా తాతయ్యా?" భయంగా అడిగింది.

"ఇవ్వరులే, ఊరికే నీతో మాట్లాడతారు".

"ఏం మాట్లాడతారు?"

"ఇంత చిన్నవయసులో ఇలా ఎందుకు చేశావని అడిగి తెలుసుకుంటారు".

"ఈ మాత్రం దానికి డాక్టర్ ఎందుకు తాతయ్యా? మీరు అడిగినా చెప్తాగా" అంది.

"సరే అయితే అందరి ముందు చెప్పు" అంటూ పాపని హాలులోకి తీసుకు వచ్చాడు. అందరూ పాపను దోషిలా చూస్తున్నారు.

"చెప్పు" అన్నాడు మేనమామ.

"ఏం చెప్పాలి?" అంది.

"ఆ వస్తువులు ఎందుకు తీశావు?"

"అవసరం వచ్చింది తీశాను".

"అవసరమైతే దొంగతనం చేస్తావా?"

"దొంగతనమా? అవి నా వస్తువులు. 'అవి నావేనా?' అని తాతయ్యని, బామ్మని అడిగాను. 'అవేం ఖర్మ... ఇంట్లో అన్నీ నీవే' అన్నారు కదా తాతయ్యా?"

"అవును" అన్నాడు శేఖరం.

"మరి నా వస్తువులు నేను తీసుకుంటే దొంగతనం ఎలా అవుతుంది? ఓసారి తాతయ్య కొబ్బరితోట అమ్మి అత్తయ్యలకు ఇస్తే... అమ్మ గొడవ చేస్తుంటే నాన్నగారు అమ్మను కోప్పడ్డారు. 'ఆయన తోట, ఆయన ఇష్టం. అమ్ముకుని ఇష్టం వచ్చిన వాళ్ళకు ఇస్తారు. మధ్యలో నీకేం కష్టం?' అన్నారు కదా?"

విద్య తలవంచుకుంది. శేఖరం, సుమిత్ర ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. శశాంక్ ఇబ్బందిగా కదిలాడు.

మేనమామ కలగచేసుకున్నాడు. "వేలెడంత లేవు. నీకిన్ని తెలివితేటలా? అవి అమ్మి ఎవరికిద్దామనుకున్నావ్... అదైనా చెప్తావా?"

"అసలు చెప్పను. చెప్పగూడదు. అప్పుడెప్పుడో అమ్మ నీకు చాటుగా డబ్బు ఇవ్వలేదా? నేను చూశానని 'అమ్మలూ! ఈ విషయం నాన్నతో చెప్పకు' అంది. 'ఎందుకమ్మా?' అంటే 'పాపం... మావయ్యకు అర్జంట్‌గా డబ్బవసరం వచ్చింది. అడిగేందుకు మొహమాటపడుతున్నాడు. నా దగ్గరేమో డబ్బు ఉంది. సాయం చేస్తున్నాను. వాడికి డబ్బు అందగానే తిరిగి ఇచ్చేస్తాడు. అవసరం ఉన్నవాళ్లకు ఇలా గుట్టుగానే సాయం చేయాలి. అందరికీ తెలిస్తే వాళ్ళకు చిన్నతనం' అందిగా అమ్మ".

మేనమామ ఖంగుతిన్నాడు. విద్య తెల్లబోయింది. మిగిలిన వాళ్లంతా బొమ్మల్లా కూర్చున్నారు.

"ఓరి దేవుడో! ఇది పిల్ల కాదు, పిడుగు. మా రోజుల్లో పిల్లల్ని ఓ దెబ్బేసి పిల్లల్లా పెంచేవాళ్లం. వాళ్ళేమో పెద్దలంటే భయభక్తులతో పిల్లల్లాగే ఉండేవారు. ఇప్పటివాళ్ళు ఒకటడిగితే పది విషయాలు చెప్పి పిల్లల్ని పసితనంలోనే పండితులను చేయాలని చూస్తున్నారు తల్లిదండ్రులు. ఇదిగో ఇదీ దాని ఫలితం" అని మొత్తుకుంది అమ్మమ్మ.

"నోరు మూసుకో" అని కసిరాడు ఆవిడ భర్త.

"చూడమ్మా, ఇవన్నీ పెద్దవాళ్ళ సమస్యలు. పసిపిల్లవు నీకెందుకు?" అన్నాడు మేనమామ.

"అవుననుకో మావయ్యా, కానీ నాకు అవసరం వచ్చింది కదా!" అంది.

"నాతో చెప్పు, ఆ వస్తువులు అమ్మకుండానే నీకు కావల్సిన డబ్బు నేనిస్తాను" అన్నాడు శేఖరం.

పాప కళ్ళు మెరిశాయి. "ప్రామిస్" అడిగింది.

"ప్రామిస్" అన్నాడు.

వెంటనే వెళ్ళి తాతగారి పక్కన కూర్చుని చెప్పటం మొదలు పెట్టింది శ్రీలలిత.

వాళ్ళింటి దగ్గర ఓ పార్కుంది. ఆ పార్కు వాచ్‌మన్ పేరు మొగిలయ్య. అతని కూతురు మాధవి. ఆ అమ్మాయితో శ్రీలలితకు మంచి స్నేహం కుదిరింది. తన

ఇంటి గురించి, తన స్కూలు గురించి ఆ అమ్మాయి చెప్తుంది. తన వివరాలు లలిత చెప్తుంది. ఇద్దరికీ ఆర్థికంగా చాలా తేడా ఉన్నా, కుటుంబ విషయాల్లో పోలికలు ఉన్నాయి. మాధవికి ఓ తాతయ్య ఉన్నాడు. ఆయనకీ ఊళ్లో కొంత పొలముంది. ఈసారి టమాటో పంట వేశాడు. కొంత అప్పున్నా తీర్చవచ్చునుకునే తరుణంలో, ధర పడిపోయి కిలో పావలాకి ఇస్తామన్నా ఎవరూ కొనలేదు. అప్పులిచ్చినవాళ్ళు ఇంటిమీదకొచ్చి, 'వారం రోజుల్లోగా అప్పు తీర్చకపోతే పంట భూమి స్వాధీనం చేసుకుంటామ'ని బెదిరించారు. 'ఉన్న ఈ కాస్త పొలం కూడా పోతే బతకడం ఎలా? ఏ పురుగుల మందో తాగి చస్తాన'న్నాడట మాధవి తాత. ఇదంతా శ్రీలలిత దగ్గర చెపుతూ, తన తాతని తల్చుకుని ఏడ్చిందట మాధవి.

పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకునే దారుణమైన దృశ్యాలు టీవీలో తరచూ చూస్తూ ఉండే శ్రీలలితకు చాలా భయం వేసింది. ఏదైనా చెయ్యాలని నిర్ణయించుకుంది. గతంలో అమ్మ వెంట నగల షాపుకి వెళ్ళినప్పుడు ఎవరో వెండి బంగారాలు అమ్మడం గుర్తుకొచ్చింది. ఈ వస్తువులు నావేగా అని అందర్నీ అడిగి రూఢి చేసుకుంది. తను ఏం అడిగినా విసుక్కోకుండా సమాధానం చెప్పే తండ్రిని అడిగి వెండి బంగారం ధరలు తెలుసుకుంది. కాలిక్యులేటర్ మీద లెక్కలు వేసి చూసుకుంది. అయిన వాళ్ళకు సహాయం చేసేటప్పుడూ గుట్టుగా చెయ్యాలి కాబట్టి ఎవరికి చెప్పలేదు.

...విషయం అంతా పూసగుచ్చినట్లు చెప్పేసింది శ్రీలలిత. ఆఖర్న తాతగారి దగ్గరగా జరిగి ఆయన భుజంమీద తల వాల్చుకుంది. "మాధవి తాతయ్య కూడా నీలాగా చాలా మంచివాడుట. మాధవికి అన్నీ కొనిపెడతాడట. ఎన్నో కథలు చెప్తాడట. 'నువ్వు బాగా చదువుకొని టీచరమ్మవి అవ్వాలి' అంటాడట. మరి అలాంటి తాతయ్య ఆత్మహత్య చేసేసుకుంటే మాధవికి తాతయ్య ఉండడు కదా! నా దగ్గరేమో డబ్బుంది కదా అని సాయం చెయ్యాలనుకున్నాను. తప్పా తాతయ్యా?" అంటూ బావురుమని ఏడ్చింది.

శేఖరానికి దుఃఖం ఆగలేదు. వింటున్న వారంతా కూడా కంటతడి పెట్టుకున్నారు.

అప్పటిదాకా దోషిలా కనిపించిన ఆ చిన్న పాప ఎంతో ఎత్తుకి ఎదిగి పోయింది వారి కళ్లకి.

మర్నాడు సాయంత్రం శ్రీలలిత ఇంటి నుండి వాళ్ళ ఇన్నోవా కారు బయలుదేరింది.

డ్రైవింగ్ సీట్లో శశాంక్, పక్క సీట్లో మొగిలయ్య, వెనక సీట్లో శేఖరం పక్కన శ్రీలలిత, మాధవి. ఉత్సాహంగా ఉన్నారు.

వాళ్ళ ఊరు గురించి, తాతయ్య గురించి ఒకటే కబుర్లు చెబుతోంది మాధవి. "ఇక్కడిలాగా అక్కడ కాసిని కాసిని చిక్కుడు కాయలు కొనుక్కోం. తాత పొలం నుంచి తువ్వాళ్లో మూట కట్టి తెస్తాడు, తెలుసా!" అని...

వాళ్లను చూసి ఆనందిస్తున్నాడు శేఖరం. ఆయన జేబులో పదిహేను వేలున్నాయి, మాధవి తాతయ్య కోసం!!

విపుల, డిసెంబరు *2010*